
కథ



అర్ధరాత్రి దాటింది.

ఎంత ఆలోచించినా తన సమస్యకు పరిష్కార మార్గం తోచటంలేదు జాన్‌పాల్‌కు. తెల్లవారితే అబ్దుల్ గఫూర్ అతడి మనుషులకు ఏం జవాబు చెప్పుకోవాలో, ఈ ఆపద నుండి ఎలా బయటపడాలో అర్థంకాక సతమతమౌతున్నాడు.

అప్పటికే అయిదారుసార్లు ప్రభువు ప్రార్థనలు చేశాడు. రెండుసార్లు చర్చికెళ్లొచ్చాడు.

# ఏ మతము నీదంటే...!

## బాలగొండ ఆంజనేయులు

తన అర్ధాంగి మేరి అర్ధరాత్రిదాటినా పచ్చి మంచి నీళ్లు కూడా ముట్టక మంచానికతుక్కుని విలపిస్తూ ఉంది. తమకు జరిగిన అన్యాయానికి. తమ సుపుత్రుల నిర్వాకం తమని సమస్యల వలయంలోకి నెట్టింది.

బంధువులు, మిత్రులు తమ చర్చిలో కలిసే వాళ్లు అందరూ వచ్చి వెళ్లారు. ఎవరికి తోచినట్టు సలహాలు, ఓదార్పులు చేశారు.

అబ్దుల్ గఫూర్ గురించి ''వాడు కరుడు గట్టిన రౌడి'' అని కొందరూ 'వాడికి ప్రాణాలు తీయటం మంచినీళ్లు తాగినంత సులువు''అని మరికొందరు చెప్పారు. వారిలో మరికొందరు ''ఆ ప్రభువును నమ్ముకున్న వాళ్లకు ఏ భయం వుండకూడదు. అంతా ఆయనే చూసుకుంటాడు ధైర్యంగా వుండు '' మత పెద్దలు కొందరు ధైర్యం చెప్పి వెళ్లారు.

కొంత మంది పాత ఇంట్లోనే వొంగి పడుకుని ''ప్రభువా! జాన్ పాల్ ముందు వారి కుటుంబాన్ని ఈ బాధల నుంచి గట్టెక్కించు తండ్రీ. పరలోకము నుండే ఈ గొఱె పిల్లలను కాచే మా కాపరి నీవే కదా తండ్రి.'' అంటూ విధవిధాల ప్రార్థించారు. పాల్‌కు ధైర్యం నూరిపోసి వెళ్లారు.

ఎన్ని ప్రార్థనలు చేసినా! ఎవరెన్ని సాహస వాక్యాలు పలికినా గఫూర్ బెదిరింపుల ముందు బలాదూర్ అవుతున్నాయి పాల్ మనసులో. ఆలోచిస్తుంటే జరగబోయే పరిణామాల గురించిన భయం ఆందోళన తగ్గడం లేదు.

గఫూర్ గురించి ఇతరులు చెప్పిందే కాదు, తనకు తెలుసు! క్రితం ఎలక్షన్లో రిగ్గింగు, రౌడీయిజం చేసి సిట్టింగు ఎమ్మెల్యేని గెలిపించటంతో వాడి పాత్ర చాలావుంది. వాడికి మర్డర్లు చేయటం, జైలుకు వెళ్లటం ఎంతో సులువు!

''అతడెంతటి రౌడీ అయినా, ఎవరి అండ వున్నా నాకు అతనితో ముఖాముఖి మాట్లాడే అవసరం కూడా లేదు. ఇప్పుడు అతనితో సమస్య రావటానికి కారణం నా సుపుత్రుడు అబ్రహామే కాదా! నా కొడుకు చేసిన తప్పు నాకు భయంగా, శాపంగా మారింది ఈ రోజు'' అనుకున్నాడు.

భార్యాభర్తలు ఉద్యోగం ఇద్దరి సంపాదనతో ఏ చీకూ చింతా లేదు. మాకు ఇచ్చిన మంచి యిల్లు. రోజు రుచికరమైన భోజనం, ఖరీదైన దుస్తులు నగరంలో నాగరిక జీవనం, సాఫీగా, హ్యాపీగా సాగే సంసారం. ఇన్నివుండీ తమ ముద్దుల కొడుకు అబ్రహాం చేసిన నిర్వాకం తమ తలపై వుంచిన ముళ్లకిరీటమయ్యింది. అబ్దుల్ గఫూర్‌తో కయ్యమే, ప్రాణాలకే ముప్పు తెచ్చిపెట్టింది.

ఒక్కగానొక్క కొడుకును బాగా చదివించి మంచి ప్రయోజకుణ్ణి చేయాలనుకున్నారు. తమ కంటే పెద్ద ఉద్యోగంలో కొడుకు బ్రతుకు కళకళలాడాలని కలలు కన్నారు.

అయితే అబ్రహాం చదువు నల్లేరు మీద నడకలా సాగింది. అతికష్టమ్మీద డిగ్రీ వరకు లాక్కొచ్చాడు.

అల్లరిమూకతో స్నేహం! ఆకతాయిలతో మమేకం! కాలేజీల వద్ద, రోడ్లు కూడలి వద్ద నిలబడి అమ్మాయిలను ఈవ్ టీజింగ్ చేయటం, అల్లరి పెట్టటం ఇవీ అబ్రహాం దినచర్యలో భాగాలు.

ఒకటి రెండుసార్లు ఈవ్ టీజింగ్ చేస్తూ పోలీసులకు చిక్కినా, తన తాత రాజన్న రిటైర్డు పోలీసు ఉద్యోగి కావటంతో పోలీసు స్టేషన్‌కు వెళ్లి తన గురించి చెప్పి ప్రాధేయపడి విడిపించుకుని వచ్చాడు.

అయితే ఇప్పుడు చేసిన తప్పు నుంచి ఎవరూ తప్పించలేరు. కలెక్టరు, ఎస్పీల వద్దకువెళ్లినా ఫలితం వుండదని తేలిపోయింది.

అబ్రహాం గఫూర్ కూతురు రజియాకు లైను వేశాడు. ఆ ప్రభువు ప్రసాదమో! లేక ఆ అల్లా ఆశీర్వాదమో గాని వారి ప్రేమ ఫలించింది. అబ్రహాం రజియా గాఢంగా ప్రేమించుకున్నారు. అబ్రహాం కౌగిట్లో తన కన్నెరికం మరిచింది రజియా! పెళ్లి కంటే ముందు తల్లి అయ్యే అవకాశం తెచ్చుకుంది.

ఉదయం గఫూర్ తన మనుషులతో జాన్ పాల్ ఇంటి మీద దాడి చేశాడు. అబ్రహాం చేసిన తప్పును బయటపెట్టాడు. రజియాతో అబ్రహాం వివాహం జరిపించకపోతే తలలు లేచిపోతాయ్'' అని బెదిరించాడు.

అంత వరకు తమ ముద్దులకొడుకు గొప్పతనం పాల్‌కుగానీ, మేరికి గానీ తెలియదు.

మధ్యలో కొందరు కలుగుజేసుకుని పంచాయితీ పెట్టారు. ఆ రోజు మధ్యాహ్నం అబ్రహాం ఇంట్లోనే.

అటు ఇటు వారి తరపున బంధువులు, మత పెద్దలు, చర్చి ఫాదరు హాజరయ్యారు. పాల్ కుటుంబంలోని వారు, వారి తరపున పెద్దలు వొప్పుకున్నారు.

సమస్య అంత తొందరగా పరిష్కారమవుతుందని వూహించ లేదు. అందరు 'హమ్మయ్యా! గఫూర్‌తో గండం గడిచింది'' అన్నట్లు వూపిరి పీల్చుకున్నారు.

అంతలోనే గఫూర్ గుంపులో నుండి ఓ మత పెద్ద గొంతు వినిపించింది.

'నిఖాకు వొప్పుకోవడం కాదు. మొదట ఈ అబ్రహాం ఇబ్రహీంగా మారాలి''

ఆ మాటకు అందరూ ఆశ్చర్యపడ్డారు. అదేమిటో అర్థంకానట్టు. మరో మత పెద్ద కలగజేసుకుంటూ ''మొదటగా మసీదులో పిల్లగాడు మతం, పేరు మార్చుకోవాలి. తరువాత సున్తీ చేసుకోవాలి. ఆ తరువాతే రజియాతో మా పద్ధతిలో నిఖా జరిపిస్తాం'' ఖరాఖండీగా చెప్పేశాడు. ఆచార వ్యవహారాల చిట్టా చదివేసినట్టు.

''నో! నో! అదేం కుదరదు. మావాడు మగ పిల్లవాడు. మేము మీ పిల్లతో పెళ్లికి వొప్పుకున్నాం కనుక పెళ్లి చర్చిలో మా ఆచారం ప్రకారం జరిపిస్తాం. రజియాను రోజీగా పేరు మార్చుకుంటాం'' అన్నాడు చర్చి ఫాదరు.

అక్కడే రగిలింది చిచ్చు.

మనుషుల కంటే. బంధాలు అనుబంధాల కంటే బలమైంది మతం.


మనిషి ఎవరు? ఊరుకంటే ముందు అతడి కులం, మతం తెలీకుంటే బ్రతకలేని సమాజం ఇది.

ఎక్కడికెళ్లినా మీదే కులం? మీదేమతం? అని అడిగే సమాజం ఇది.

ఇద్దరి మధ్యన చాలాసేపు వాగ్వివాదం, ఘర్షణ జరిగింది. కొట్టుకునే స్థాయికి వచ్చింది.

కానీ, అంతలోనే సద్దుమణిగింది. అది గఫూర్ హెచ్చరికతో ''రేపు పది గంటలదాకా టైమిస్తున్నా! మేం చెప్పినట్టు వొప్పుకోవాలి. లేకుంటే మీవాడి శవం రైలుపట్టాల మీద చూస్తారు మీరు!'' అని ''లేవండ్రా'' అంటూ తన మనుషులు, పెద్దలతో వెళ్లిపోయాడు.

''వాళ్లని నయాన భయాన వొప్పించుకోవాలి. లేకుంటే తన కూతురు బతుకు బజారు పాలవుతుంది.'' అవి మనసులో తలచి తెలివిగా వెళ్లిపో



యాడు.

"తెల్లవారితే పది గంటలకు వస్తాడు గఫూర్. వాడు రౌడీ. మనం మర్యాదస్తులం. ఎందరో తలలు తీసిన వాడికి మేమొకలెక్కా! వాడికి ఎమ్మెల్యే అండ వుంది. ప్రజల్లో వాడంటే భయం వుంది. ఏం చేయాలి? ఎవర్ని ఆశ్రయించాలి! ప్రభువా నాకు దారి చూపించవా! నా కొడుకు మత మార్పిడి తప్పదా! అని ఆలోచిస్తుంటే తను మతం మార్చుకున్న గతం గుర్తుకొచ్చింది.

నేటి జాన్‌పాల్ ఒకప్పుడు జానకిరాముడు. తాను పుట్టింది పెరిగింది ఒంటి మిట్ట దళితవాడ.

తన తండ్రి సుబ్బన్న ఓ స్కూలు టీచరు. హిందూ ఆచార సాంప్రదాయాల్ని తూ.చ. తప్పక పాటించిన మహామనిషి. రామాయణ, భారత భాగవతాల్ని కంఠస్తం చేసిన మహా పండితుడు.

జనులందరికి కులం, మతం, భేదం లేకుండా శ్రీరామచరితం చదివి టీకా తాత్పర్యంతో వినిపించినవాడు. పోతన ఒంటిమిట్టలో భాగవతం రాస్తే, సుబ్బన్న ఆ భాగవతాన్ని భావార్థాలతో అరటి పండు వొలిచినట్టు వివరించినవాడు.

ప్రతి శ్రీ రామనవమికి ఒంటిమిట్ట వుత్సవాల్లో సుబ్బన్నకు ఓ ప్రత్యేక స్థానం కలిపించే వాళ్లు. ఓ వేదిక ఏర్పాటు చేసి రంగనాథ రామాయణం సుబ్బన్న గారితో వారం రోజులపాటు ప్రతిరోజు పఠనం చేయించేవారు.

ఏడాదికోసారి తప్పక తిరుమల వెళ్లొచ్చేవాడు సుబ్బన్న. సుబ్బన్న ఆ రాముని భక్తుడు గనుక తన ఒక్కగానొక్క కొడుక్కి ఆ సీతమ్మ పేరు కూడా కలిసివొచ్చేలా జానకిరాముడని పేరు పెట్టాడు.

చిన్నప్పుడు తన తండ్రితోపాటు తిరుమలకు వెళ్లేవాడు జానకిరాముడు. తిరుపతి ప్రసాదమంటే తనకెంతో ఇష్టం!

హైస్కూలు వరకు తమ వూర్లోనే చదువు ముగించాడు. ఇంటర్, డిగ్రీ కడపలో చదివాడు.

డిగ్రీ అయిపోగానే కడప కలెక్టరేటులో క్లర్కు ఉద్యోగం దొరికింది. అదంతా తన తండ్రి చేసిన పూజాఫలం అనుకున్నాడు.

ఉద్యోగంలో చేరాల్సిందని ఆర్డరు అందగానే తిరుమలకువెళ్లి శ్రీ వెంకటేశ్వరునికి తలనీలాలిచ్చి వచ్చాడు.

తన తండ్రి పంచాంగం చూసి మంచిరోజు నిర్ణయిస్తే వెళ్లి ఉద్యోగంలో చేరాడు.

చిన్నప్పటి నుండి జానకి రామునికి ఎన్నో కోర్కెలు. మంచి డ్రెస్‌లు వేసుకుని, ఇన్‌షర్టు చేసుకుని, బూట్లు వేసుకుని స్కూటరు మీద వెళ్లి ఉద్యోగం చేయాలని, నాగరిక జీవనం గడపాలని. ఉద్యోగంలో చేరగానే కోర్కెలన్నీ కొలిక్కి వచ్చినట్టేనని తలచాడు.

చదువు అయిపోయింది. ఉద్యోగం వచ్చింది. ఇక తరువాతి కార్యక్రమం పెళ్లి ఇంకెందుకు ఆలస్యం" అన్నట్టు అందరూ వెంటపడ్డారు.

జానకిరాముడి కోర్కెలకు మరో కోరిక తోడయ్యింది ఉద్యోగం వచ్చాక. ఉద్యోగం చేసే అమ్మాయిని పెళ్లి చేసుకుంటే ఇద్దరి సంపాదనతో సంఘంలో ఆర్థికంగా నిలదొక్కుకుని హాయిగా జీవించాలన్న తపన, ఆశ కలిగాయి.

ఒక రోజు తమ వూరి పెద్ద మనిషి ఓ సంబంధం తీసుకొచ్చాడు.

రిటైర్డు ఆర్ఎస్సై రాజన్న సంబంధం. రాజన్న కూడా ఒకప్పుడు ఒంటిమిట్ట దళిత వాడకు చెందినవాడే! పోలీసు కానిస్టేబులుగా సెలక్టు అయి కడపకు వచ్చాడు. ఆ తరువాత ప్రమోషన్ల మీద ఆర్ఎస్సై అయ్యాడు. రిటైర్డు కూడా అయ్యాడు. అతనికి ఇద్దరు కూతుర్లు. మొదటమ్మాయికి పెళ్లి చేశాడు. రెండో అమ్మాయి మేరీకి పెళ్లి చేయాలి.

రిటైర్ అయ్యాక వచ్చిన డబ్బుతో కూతుళ్లిద్దరికీ ఇళ్లు కట్టించాడు.

పెళ్లయిన మొదటమ్మాయి ఆసుపత్రిలో నర్సు. రెండో అమ్మాయి మేరి కడప మున్సిపాల్టీలో టీచర్‌గా పనిచేస్తోంది.

రాజన్న సంబంధం మంచిదే అనిపించింది తనకు తన తండ్రికి. అయితే ఓ చిక్కు వచ్చిపడింది. అది సుబ్బన్నకు సుతారాము ఇష్టం లేదు.

రాజన్న పట్టణంలో స్థిరపడ్డాక చాలాకాలం క్రితం మతం మార్చుకున్నాడు. క్రిష్టియన్‌గా మారిపోయాడు. అందుకే "నా కూతుర్ని యిచ్చి పెళ్లి చేయడానికి అభ్యంతరం లేదు. అయితే పెళ్లి మాత్రం చర్చిలో క్రిష్టియన్ పద్ధతిలో జరగాలి" అన్నాడు. అది తన తండ్రికి నచ్చలేదు.

తరువాత ఎంత వెదికినా తనకు అటువంటి సంబంధం దొరకలేదు.

మంచి ఇల్లు, ఉద్యోగం చేసే అమ్మాయి, కట్నం.. ఇన్ని కలిసొస్తుంటే అందుకు మిత్రుల ప్రోద్బలం తోడై తన తండ్రిని వొప్పించాడు మేరితో పెళ్లికి.

కొడుకు కోరికను మన్నించక తప్పలేదు సుబ్బన్నకు. చర్చిలో సూటు బూటులో జానకి రాముడు– తెల్లటి గౌనులో మేరి.

పెద్దల ఆశీర్వాదం భక్తుల ప్రార్థనల మధ్యన ఫాదర్ చేతుల మీదుగా పెళ్లి ఘనంగా జరిగింది.

సుబ్బన్న మాత్రం తండ్రిగాకాక ఓ ప్రేక్షకుడిగా వుండిపోయాడు.

మొదట్లో మేరి ఓ మూల ప్రభువును పూజిస్తే, తను ఓ బాలాజి పటం పెట్టి పూజించేవాడు.

కాలక్రమేణా భార్య మేరి, మామ రాజన్నలేకాక ఇతరుల ప్రోద్బలంతో తను క్రిష్టియన్ మతం పుచ్చుకోక తప్పలేదు. జానకి రాముడు పేరును జాన్ పాల్‌గా మార్చుకున్నాడు.

గతమంతా గుర్తుకొచ్చి "నాడు నేను ఉద్యోగం చేసే భార్య కావాలని మతం మార్చుకున్నాను. ఇప్పుడు నా కొడుకు తను ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకోడానికి మతం మార్చుకుంటే తప్పేముంది?

"గఫూర్ చెప్పినట్లు చేస్తే నా కొడుకు సజీవంగా వుంటాడు. బిడ్డ క్షేమంగా వుండడమే కదా ఏ తల్లిదండ్రయినా కోరుకునేది."

"గఫూర్‌ను సాదరంగా ఆహ్వానించాలి. వాళ్లు కోరినట్లే వివాహం జరిపించమని చెప్పాలి. అయినా కలసిన రెండు మనసులు ఒకటవడానికి మధ్యన మతం అడ్డుగోడలెందుకు? వాళ్లిద్దరు ఒకటై క్షేమంగా వుంటే అదే చాలు!" ఆలోచనలో పడ్డాడు.

"నాడు నేను. నేడు నా కొడుకు. రేపు వాడి పిల్లలు ఏ మతమో ఎవరికి తెలుసు! అది ఆ ప్రభువుకే తెలుసు!" ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాడు జాన్‌పాల్. తన్ను అంతవరకు పీడించిన సైతాన్ వదలి పారిపోయినట్టు.

★

